

ఆధునీకరణ పనులు వేగవంతం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. - 8లో



నేడే స్వర్ణముఖి హారతులు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్వర్ణముఖి నదికి మంగళవారం హారతులు సమర్పించనున్నారు. - 8లో



మద్యం తరలిస్తూ అరెస్ట్

మద్యం తరలిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు అరెస్ట్ అయిన ఘటన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

రూ.5 కోట్లతో పూడి కాజ్‌వే



పూడి కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: ఏడు దశాబ్దాలుగా నాలుగు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయా గ్రామాల మధ్య రూ.5 కోట్లతో కాజ్‌వే నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తుపాను కారణంగా కొట్టుకుపోయిన రాజులకండ్రిగ, పూడి గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా రాజులకండ్రిగ, పూడి, పోలి నాయుడు కండ్రిగ, పూడి సీకేపురం గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వే కొట్టుపోయి ఆయా గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా రూ.5 కోట్లతో కాజ్‌వే నిర్మిస్తామని చెప్పారు. అదేవిధంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా 24 గంటల్లో తాత్కాలిక మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల పార్టీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, ముఖ్యనేతలు నం దకుమార్, లాల్‌బాబుయాదవ్, శాస్త్రిరాజు, డేవిడ్, రామ్మోహన్‌వర్మ, దేవళ్ల మణి, మణి, అరుల్, ఢిల్లీబాబు, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: స్పందన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి చాలా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 187 ఫిర్యాదులు అందగా.. అందులో 139 సమస్యలు రెవెన్యూకు సంబంధించినవి ఉన్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచల కిషోర్‌తోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసరావు, భవానీ శంకర్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం



ఆడుదాం ఆంధ్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా క్రీడాధికారులు

తిరుపతి కల్చరల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రీడల్ని ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని క్రీడలకు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తిరుపతి జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. ఈమేరకు సోమవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతి క్రీడాభివృద్ధికి ఒక స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని వారు ఆకాంక్షించారు. ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి సాయికుమార్, థైక్వాండ స్టేషన్ కార్యదర్శి పీ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సహస్ర కలశాభిషేకం



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న చైర్మన్, ఈవో

శ్రీకాళహస్తి: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో బిల్వ, కుంకుమార్చల ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లను సహస్ర కలశాభిషేక సంకల్ప పూజలు ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం సహస్ర కలశాలను ఏర్పాటుచేసి యజ్ఞ గుండంలో పూజలు నిర్వహించారు. ఈవో రామారావు, అంజూరు శ్రీనివాసులు దంపతులు ఆకాశ దీపానికి పూజలు చేసి ఎగురవేశారు.

రోగాలకు దూరంగా ఉండాలి

తిరుపతి అర్బన్: రోగాలకు దూరంగా ఉండాలంటే వ్యాధినిరోధక శక్తి ఉండాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ చేతులమీదుగా సమగ్ర మిషన్ ఇంద్రధనస్సు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శాంతకుమారి పాల్గొన్నారు.

వైవిద్యాలయం

నీకు వందనం

బడిలో..గుడిలో.. అక్షర మడిలో.. వెతల జడిలో..వెలుగుల కాగడా.. మూసపద్ధతిపై కొరడా.. వైవిధ్య సవ్వడి.. వెరసి.. బాలికల్లో చదువుల ఒరవడి. విద్యావ్యవస్థలో నూతన ఒరవడులకు శ్రీకారం చుడుతోంది ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సర్కారు స్కూళ్లలో ఆంగ్లమాధ్యమం, హైస్కూలు ప్లస్ తదితర విధానాలను అమలు చేసింది. ఈ విధానాలు సఫలీకృతం కావడంతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ చేకూరుతోంది. వైవిధ్యమైన హైస్కూలు ప్లస్ విజయవంతంపై ప్రత్యేక కథనం.

- బాలికలకు ప్రత్యేకంగా ఇంటర్ విద్య
- సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ నిర్ణయం
- సొంతూరిలోనే బాలికలకు ఇంటర్ విద్య



ఎం.బండపల్లె హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఇంటర్ తరగతులు బోధిస్తున్న అధ్యాపకురాలు

చిత్తూరు కలెక్టరేట్ : హైస్కూల్ ప్లస్ విధానంలో బాలికలకు ఉన్న ఊళ్లల్లోనే ఇంటర్మీడియట్ విద్యను అందిచాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆశయం. ఇందుకు అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 35 ఉన్నత పాఠశాలలను గుర్తించి హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. 2022–23 విద్యాసంవత్సరంలో ఈ విధానాన్ని అమలు చేసింది. సంబంధిత పాఠశాలల్లో ఇంటర్ విద్యకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రవేశపెట్టింది. ఆ గ్రూపుల బోధనకు అధ్యాపకులను సైతం నియమించింది. ఆయా కోర్సుల విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేసింది. ఫలితంగా ఆ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 489 మంది, ద్వితీయ సంవత్సరం 536 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో బాల్య వివాహాలు, పదో తరగతి పూర్తవగానే పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపడం వంటి వాటికి ఫుల్‌స్టాప్ పడింది. మరోవైపు ఇంకో రెండేళ్ల పాటు చదువుకునే అవకాశం దక్కుతోందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు.

గత పాలనలో దయనీయం

'బాలికల చదువు భవితకు వెలుగు' అన్నది నానుడి. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం పలువురు తల్లిదండ్రులు బాలికల చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే అనేక గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో మాత్రం ఈ పరిస్థితి ఉండడం లేదు. నిర్ణీత విద్యాభ్యాసం పూర్తయితే చాలు.. అత్తారింటికి పంపించి, తమ బరువు, బాధ్యతలు దించుకుందామనే ఆలోచనలో ఉంటారు. దీనికి అంతంత మాత్రంగా ఉండే కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆడపిల్లకు చదువెందుకనే ధోరణి, తమ గ్రామానికి కళాశాలలు దూరంగా ఉండడం, కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు ఏవైనా దుర్ఘటనలు చోటు చేసుకుంటే గ్రామంలో తలెత్తుకోలేమనే భయం.. ఇలా అనేక కారణాలున్నాయి. కొన్ని గ్రామల్లో పదో తరగతి చదివితే చాలు.. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసే దయనీయ పరిస్థితులున్నాయి. మరికొంత మంది చదువు మాన్పించి, టైలరింగ్, కూలి తదితర పనులకు పంపించి, వరుడు దొరికితే వివాహాలు చేసేవారు. దీంతో పదో తరగతి చదువుకున్నా ఆ అమ్మాయికి ఎటువంటి ఉపయోగమూ ఉండేది కాదు.

మార్పు వచ్చింది

ఉన్న ఊళ్లోనే ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఈ పరిస్థితి మారుతుందని ప్రభుత్వం భావించింది. పదో తరగతి పూర్తయిన వెంటనే అదే పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం వరకూ చదువుకునే వెసులుబాటు కల్పించింది. అవసరమైన అన్ని వసతులూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్ చదివేందుకు ఉన్న ఊరు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో ప్రభుత్వం భావించినట్టుగానే తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. గ్రామంలోనే కళాశాల ఉండడంతో తమ కుమార్తెలను మరో రెండేళ్ల పాటు ఇంటర్ చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ పూర్తయ్యాక 'ఇంత చదువు చదివింది కదా.. మధ్యలో ఆపడం ఎందుక'ని డిగ్రీ చదివేందుకు కూడా అడ్డు చెప్పడం లేదు. ఫలితంగా ఇంజినీరింగ్ వంటి ఉన్న విద్యను అభ్యసిస్తున్న బాలికలు ఉద్యోగాలు సైతం పొందుతున్నారు. అనంతరం కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడమే కాకుండా విద్యావంతులుగా రాణిస్తున్నారు. ఫలితంగా వారికి ఆర్థి స్వాతంత్య్రం లభిస్తోంది. ఈ పరిణామం జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు, విద్యార్థినులు, విద్యావేత్తల్లో ఆనందం నింపుతోంది.

తిరుపతి జిల్లాలోని పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌ను గత విద్యాసంవత్సరంలో హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టి, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. గతంలో ఆ మండలంలో బాలికల ప్రభుత్వ కళాశాలకు వెళ్లాలంటే 25 కిలో మీటర్ల దూరంలోని నగరి, పుత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. అంత దూరం బాలికలను పంపడం ఇష్టం లేక తల్లిదండ్రులు చదువు మాన్పించేవారు. నేడు పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్ గా అప్‌గ్రేడ్ చేయడంతో బాలికల అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి.



తిరుపతి జిల్లా పిచ్చాటూరులోని జెడ్పీహైస్కూల్ ప్లస్ పాఠశాల

చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇంటర్ చదవాలంటే గతంలో ఆ గ్రామం నుంచి చిత్తూరు, పూతలపట్టు మండల కేంద్రానికి విద్యార్థినులు వెళ్లాల్సిన పరిస్థితి. దూరాభారం అమ్మాయిలను పంపడం ఇష్టం లేని తల్లిదండ్రులు పదితో చదువు మాన్పించి, పెళ్లిళ్లు చేసేవారు. ఎం.బండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హైస్కూల్ ప్లస్ చేయడంతో పలువురు తమ కుమార్తెలను ఆ పాఠశాలలోనే ఇంటర్ చదివిస్తున్నారు.



చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె హైస్కూల్ ప్లస్

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

హైస్కూల్ ప్లస్ పాఠశాలలు	35
ఎంపీసీ గ్రూపులో బాలికలు	396
బైపీసీ గ్రూపు చదువుతున్న వారి సంఖ్య	315
సీఈసీ చదువుతున్న బాలికలు	314
మొత్తం	1,025



చదువుకుంటున్న విద్యార్థినులు

ప్రభుత్వ ఆశయం నెరవేరింది



జిల్లాలోని పలు ప్రాంతాల్లో గతంలో పదో తరగతి పూర్తి కాగానే బాలికలకు పెళ్లిళ్లు చేసేవారు. ఆడపిల్ల కదా దూరాభారం చదువుకు ఎందుకు పంపేది అనే ధోరణి కొంత మంది తల్లిదండ్రుల్లో ఉండేది. ప్రభుత్వం హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో మార్పు వచ్చింది. హైస్కూల్ ప్లస్‌పై వేసవి సెలవుల్లో విస్తృతంగా క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. దీంతో అడ్మిషన్లు పెరిగాయి. ఈ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశయం నెరవేరింది. **- విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు**

ధోరణి మారింది



గతంలో పదో తరగతి పూర్తయ్యిందంటే చాలు అమ్మాయిలకు పెళ్లి సంబంధాలు వెతికేవారు. రాష్ట్ర ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ విద్యను ప్రారంభించాక తల్లిదండ్రుల ఆలోచన ధోరణిలో మార్పు వచ్చింది. అంత త్వరగా పెళ్లిళ్లు చేయడం ఎందుకని ఆలోచించడం మొదలుపెట్టారు. గ్రామంలోనే కళాశాల ఉంది కదా ఇంటర్ వరకు చదివించి ఆ తర్వాత ఉన్నత చదువులు చదివిద్దాం అని అనడం మొదలుపెట్టారు. **- శేఖర్, డీఈఓ, తిరుపతి జిల్లా**


ఎంతో ఉపయోగం



పదో తరగతి తర్వాత మమ్మల్ని బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడేవారు. ఇంటర్ చదవాలంటే దూర ప్రాంతం వెళ్లాల్సిందే. రోజూ వెళ్లి రావాలంటే రూ.100 ఖర్చవుతుంది. ఆర్థిక భారంతో పాటు, ఆడపిల్లనే భయంతో పదో తరగతి వరకు చాలు అని అనేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేను పదో తరగతి చదివిన హైస్కూల్‌లోనే ఇంటర్మీడియట్ పెట్టడంతో ఇక్కడే చేరాను. అధ్యాపకులు బాగా పాఠాలు చెబుతున్నారు. **- చందు, విద్యార్థిని, ఎం.బండపల్లి, చిత్తూరు జిల్లా**

శ్రమించు..లక్ష్యాన్ని ఛేదించు

- సాక్షి మీడియా గ్రూప్ -1, 2 పరీక్షల అవగాహన సదస్సుకు విశేష స్పందన
- సాధారణ తెలివితేటలతో అసాధారణ విజయాలు
- పోటీ పరీక్షలపై సివిల్స్ విజేత బాలలత సూచన



సదస్సుకు హాజరైన అభ్యర్థులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్స్ విజేత బాలలత

తిరుపతి కల్చరల్: ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే విజయం సాధించడం సుసాధ్యమని సివిల్స్ విజేత బాలలత తెలిపారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన గ్రూప్–1, 2 పరీక్షలపై అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నుంచి సివిల్స్ విజేత బాలలత ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ఆయా పరీక్షలకు అభ్యర్థులు ఎలా సమాయత్తం కావాలో ఆమె మార్గదర్శకం చేశారు. త్వరలో గ్రూప్స్ పరీక్షలకు నోటిఫికేషన్స్ రానున్న నేపథ్యంలో ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతూ ఇష్టంగా ప్రయత్నం చేస్తే లక్ష్యాలు సులభతరమవుతాయన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సాధించాలనే ఆకాంక్షతో పాటు ఓర్పు, సహనం అవసరమని చెప్పారు. గ్రూప్స్ మాత్రమే హాజరవుతాం.. మిగిలిన పరీక్షలకు అక్కరలేదు అనే భావన నుంచి యువత బయటకు రావాలన్నారు. నోటిఫికేషన్లు వచ్చే అన్ని పరీక్షలకు అర్హులమేనన్న ఆలోచనతో హాజరు కావాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పుస్తకాల ద్వారా విలువైన సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం ముద్రించిన ప్రచురణలు, ఆయా ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ఉన్న సమాచారాన్నే ప్రమాణికంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పథకాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్లు, ఆర్థిక సర్వేలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నీతిఆయోగ్ వంటి సంస్థలు విడుదల చేసే సర్వేలను పరిశీలించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల జరిగిన విపత్తులపై సైతం అవగాన కలిగి ఉండాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల సమాచారం, కేంద్ర పురస్కారాలు వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని తెలిపారు. జీవితం చాలా విలువైందని, యవ్వన దశ చాలా కీలమని గుర్తించి ఈ దశలో అనుకున్న లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు.


భయం వీడండి



డీవీఎస్.చక్రవర్తిరెడ్డి


ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల అధినేత డీవీఎస్.చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ ముందుగా భయాన్ని విడనాడి, తెలివిగా శ్రమించాలని చెప్పారు. ప్రశ్నల సరళిని అర్థం చేసుకునే నైపుణ్యం ఉంటే గెలుపు సుసాధ్యమన్నారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ బీ.సత్యేంద్రబాబు మాట్లాడుతూ ఇష్టపడి చేసే ఏపనైనా సులభతరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి టీవీ కరస్పాండెంట్ మూర్తి, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం



సివిల్ విజేత మేడమ్ బాలలత అందించిన చక్కటి సందేశం నాకు స్ఫూర్తినిచ్చింది. జాబ్ సాధిస్తానన్న నమ్మకం కలిగింది. ఇదే స్ఫూర్తితో, పట్టుదలతో ప్రయత్నం చేస్తా. గ్రూప్–1, 2 పరీక్షల నోటిఫికేషన్‌కు ముందే సాక్షి వారు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు ఎంతో దోహదం చేసింది. సాక్షి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. **- ఎం.జయంతి**

ఇది లక్ష్యానికి నాంది




నోటిఫికేషన్‌కు ముందే సాక్షి నిర్వహించిన సదస్సు మా లక్ష్యాల ఛేదనకు ఎంతో దోహదం చేసేలా ఉంది. సదస్సులో చెప్పిన ప్రతి అంశం నాలో స్ఫూర్తిని రగిలించింది. ప్రయత్నిస్తే విజయం సాధిస్తామన్న నమ్మకం కలిగింది. 'సాక్షి' వారి మేలు మరువలేము. **- మనోజ్**

చక్కని మార్గదర్శకం




నేను గ్రూప్స్‌కు సిద్ధం కావాలని నిర్ణయించుకున్నా. గ్రూప్స్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలనే ఆలోచన ఉండేది. సాక్షి వారు నిర్వహించిన అవగాహన సదస్సు చక్కటి మార్గదర్శకతను చూపింది. మేడమ్ బాలలత అందించిన బోధనలు మాకు బాగా అవగతమయ్యాయి. పోటీ పరీక్షకు సన్నద్ధమయ్యే ధైర్యాన్ని ఇచ్చాయి. **- లక్ష్మి**

సమాధానం దొరికింది



యువత లక్ష్యాల పట్ల ఆకాంక్షను గుర్తించి సాక్షి వారు గ్రూప్స్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఈ సందర్భంగా సివిల్ విజేత అయిన మేడమ్ బాలలత అందించిన బోధన నా ఆకాంక్షను మరింత పెంచింది. విజయ సాధనకు చక్కటి స్ఫూర్తినిచ్చింది. నాలో కలిగే సందేహాలకు సమాధానం లభించింది. **- తనూష**

విలువైన సమాచారం తెలుసుకున్నా



తొలి సారిగా గ్రూప్ పరీక్షలు రాయాలనుకుని డిసైడ్ అయ్యాను. ఇప్పుడు దీనికి సాక్షి వారి అవగాహన సదస్సు విలువైన సమాచారం నాకు ఎంతో దోహదపడింది. మనోస్థైర్యాన్ని నింపింది. పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రాథమికంగా ఉండే అనేక అపోహలు, సందేహాలను ఈ సదస్సు ద్వారా నివృత్తి చేశారు. సదస్సులో మేడమ్ అందించిన సూచనలతో పరీక్షలకు ముందుకు సాగుతాం. **- పీ.శివకుమార్**

అలా బతకాలని!

- అట్టహాసంగా వైఎస్సార్ లానేస్తం
- జిల్లాలో 1,006 మందికి లబ్ధి
- లబ్ధిదారులకు రూ.50.3 లక్షలు జమ



లా నేస్తం మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: వృత్తిలో స్థిరపడాలి. వారి చదువుకు.. ప్రాక్టీసుకు ఎలాంటి ఇబ్బందీ ఉండకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూనియర్ లాయర్లకు నెలకు రూ.5 వేల చొప్పున పంపిణీ చేస్తోంది. ఏడాదికి రెండు విడుతలుగా నగదు మొత్తాన్ని సంబంధిత లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ లా నేస్తం నిధుల విడుదల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని లబ్ధిదారులతోపాటు అధికారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో విడతలో 1, 006 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేల చొప్పున ఆరు నెలలకు రూ.30 వేలుచొప్పున మొత్తం రూ.50.3 లక్షలు జమచేస్తున్నట్టు తెలిపారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువ లాయర్లకు వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

క్లుప్తంగా

ఎస్వీయూలో ఘనంగా అథ్లెటిక్ మీట్



ఎస్వీయూ రిజిస్ట్రార్‌తో పరిచయ కార్యక్రమం

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ సోమవారం ఎస్వీయూ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ అథ్లెటిక్ మీట్‌ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మొహమ్మద్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం వర్సిటీ పరిధిలోని 30 కళాశాలల నుంచి హాజరైన 300 మందికిపైగా క్రీడాకారులు రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హేమర్, లాంగ్ జంప్, హైజంప్ వివిధ క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 73,091 మంది స్వామివారిని దర్శించుకోగా 23,246 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

డీకేటీ భూమిపై సర్వహక్కులూ మీవే!

- 15.40 ఎకరాల భూమి.. 23 మంది లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు
- అరిగిలవారిపల్లి భూ పంపిణీలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడి



భూ పట్టాలు పొందిన రైతులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: డీకేటీ భూమి.. ఇక మీ సొంత భూమి అని, ఈ మేరకు లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పనబాకం పంచాయతీ, అరిగిలవారిపల్లిలో భూపంపిణీ పథకం కింద లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన 23 మంది లబ్ధిదారులకు 15.4 ఎకరాల భూమికి శాశ్వత పట్టాలను అందజేశారు. అనంతరం తుడా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి కుటుంబ ఆర్థిక ప్రగతికి సీఎం జగన్ అమలు చేసిన పథకాలు దోహదం చేశాయని కొనియాడారు. భూ పంపిణీ కార్యక్రమాన్ని మొదటగా చంద్రగిరి నియోజకవర్గం అరిగిలవారిపల్లి నుంచే శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. పంపిణీ చేసిన భూమి విలువ రూ.6.16 కోట్ల వరకు ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల కోసం ఒక్క పనాబాకం పంచాయతీకి రూ.9 కోట్ల వరకు నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. సీఎం జగన్ ఆశయ సాధనకు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడిగా ప్రజాక్షేత్రంలో అంకిత భావంతో పనిచేస్తానని, 2024 ఎన్నికల్లో ఆదరించి, ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, సింగల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, ఎంపీడీఓ బాలాజీనాయక్, తహసీల్దార్ శిరీష, ఈఓపీఆర్డీ శశిరేఖ, పంచాయతీ అధ్యక్షుడు పానేటి చెంగల్రాయులు, నాయకుడు మణియాదవ్, మాజీ సర్పంచ్ గోపాల్, నాగభూషణం, నాగేశ్వరరావు, హరికృష్ణ, దూర్వాసులు, చిట్టి, ఢిలీశ్వర్ యాదవ్ ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం

నేడే స్వర్ణముఖి హారతులు



ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉత్తర వాహినిగా ప్రవహిస్తూ.. భరద్వాజ వరప్రసాదినిగా ప్రసిద్ధి చెందిన స్వర్ణముఖి నదికి మంగళవారం కార్తీకమాసం సందర్భంగా హారతులు సమర్పించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఐదేళ్లుగా స్వర్ణముఖినది హారతుల సమయానికి వర్షంతో నిండిపోవడం విశేషం. ఇదిలావుండగా హారతులు సమర్పించేందుకు జలవినాయకుని వద్ద నుంచి స్వర్ణముఖి నదిలోకి దిగే ప్రాంతంలో వేదికను సిద్ధం చేశారు. హారతులు సమర్పించేందుకే ప్రత్యేకమైన స్టాండ్లను, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కరకట్టపై నుంచి హారతులు చూసేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక కార్తీక మాసం సందర్భంగా గత 15 రోజులుగా జరుగుతున్న లక్ష, కోటి కుంకుమ, బిల్వార్చన ముగింపు సందర్భంగా స్వామివారికి సహస్ర కలశాభిషేకం చేసి కుంకుమ, బిల్వాలను స్వర్ణముఖి నదిలో నిమజ్జనం చేయనున్నారు.



స్వర్ణమ్మ హారతులకు ప్రత్యేక వేదిక

ఆలయ ఆధునికీకరణ పనులు వేగవంతం

–టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశించారు. సోమవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి విచ్చేసిన ఆయన ప్రస్తుతం ఆలయంలో చేస్తున్న ఆధునికీకరణ పనులను పరిశీలించి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు–సలహాలు ఇచ్చారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ మమత స్వాగతం పలికారు. ఆయనగంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు అర్చకులు అమ్మవారి ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్ఆర్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, తొండమనాటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

మద్యం తరలిస్తూ ఆర్టీసీ ఉద్యోగుల అరెస్ట్

తిరుపతి క్రైమ్: ఆర్టీసీ బస్సులో అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం పాండిచ్చేరి నుంచి తిరుపతికి వచ్చే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులో మద్యం బాటిళ్లు వస్తున్నట్టు ఏపీఎస్‌ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రమణకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ వైటీసీ రెడ్డిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులకు అప్పజెప్పినట్టు పేర్కొన్నారు. డ్రైవరును విచారించగా అలిపిరి డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మర్రిచెట్టు వాసు 60 మద్యం బాటిళ్లు తీసుకు రమ్మన్నాడని.. ఒక్కో బాటిల్‌పై రూ.100 కమీషన్ ఇస్తారని చెప్పారు. దీంతో వాసును కూడా అరెస్ట్ చేసి 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.36,000 వరకు ఉంటుందన్నారు.

ప్రాణానికి ప్రాణం!

- నడుములోతు నీటిలో నడుచుకుంటూ సాహసోపేతం
- గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి స్థానికులు



పులికాట్ సరస్సులో గాయపడిన వెంకటేష్‌ను మంచంపై మోసుకొస్తున్న స్థానికులు

దొరవారిసత్రం: ప్రాణాలను పణంగా పెట్టారు. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించడానికి ఎటూ దారిలేకపోవడంతో సాహసోపేత నిర్ణయానికి దిగారు. పులికాట్‌లో నడుములోతు నీటిలో ఈదుకుంటూ క్షతగాత్రుడిని మంచంపై పడుకోబెట్టి ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం తీర గ్రామాల్లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం, కారికాడు దళితవాడకు చెందిన దూడల వెంకటేశ్(34) సోమవారం వరి పొలానికి మందులు వేసేందుకు టైరు బండిలో వెళ్లాడు. మార్గమధ్యంలో బండి కింద పడ్డాడు. రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని చికిత్స కోసం తరలించేందుకు ప్రయత్నించారు. మీజూరు సమీపంలో భారీ వర్షాలకు రోడ్డు గండి పడడంతో అతన్ని దాటించలేకపోయారు. చేసేదిలేక వెంకటేష్‌ను మంచంపై పడుకోబెట్టుకుని పులికాట్ సరస్సులో నడుములోతు నీటిలోనే నడుస్తూ దాటించారు. అనంతరం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి తిరుపతి ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు వైద్యులు పేర్కొన్నారు.

17 నుంచి తిరుప్పావై పారాయణం

తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 17 నుంచి 2024 జనవరి 14 వరకు పెద్ద జీయ్యంగార్ స్వామి మఠంలో తిరుప్పావై పారాయణం చేపట్టనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న పెరియకోయిల్ కేల్వి అప్పన్ శ్రీ శఠగోప రామానుజ పెద్దజీయంగార్ స్వామి మఠంలో నెల రోజులు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు తిరుప్పావై పాశురాలను పారాయణం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవత్ రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో పెద్ద జీయంగార్ మఠం ఏర్పాటైంది. శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం శ్రీ రామానుజాచార్యులు ప్రవేశపెట్టిన కైంకర్యాలు, క్రతువులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రామానుజాచార్యుల పరంపరలో వస్తున్న జీయంగార్ స్వాములు తిరుమల శ్రీవారి ఆలయ కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

రౌడీ షీటర్ దారుణ హత్య



హత్యకు గురైన కిషోర్(ఫైల్)

తిరుపతి క్రైమ్: రౌడీషీటర్ దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలోని సుబ్బారెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న భూపాల్ కుమారుడు కిషోర్(30) జులాయిగా తిరిగేవాడు. ఇదేక్రమంలో గత వారం తన కాలనీలో నివాసముంటున్న ఓ మహిళను అప్రోజే అనే యువకుడు ఏడిపించాడు. ఈ విషయం కిషోర్‌కి తెలిసింది. దీంతో అప్రోజేను పిలిపించి వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అప్రోజే తన స్నేహితులు దేవేంద్ర, లోకేష్ స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి సుబ్బారెడ్డి నగర్‌లో ఉన్న కిషోర్‌తో గొడవ పడ్డారు. ఆపై దేవేంద్ర, లోకేష్ స్నేహితులైన శివ, రాహుల్, చరణ్ మరికొందరితో కలిసి కిషోర్‌ని చంపేయాలని నిశ్చయించారు. ఆదివారం రాత్రి కిషోర్ సుబ్బారెడ్డి నగర్‌లోని రోడ్డు పక్కన ఉన్న చీకటి ప్రాంతంలో మద్యం సేవిస్తుండగా అందరూ వెళ్లి గొడవపడి కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందివ్వకుండా వారి స్వగ్రామమైన వెదురుకుప్పం మండలం, బలిజిపల్లికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆపై పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు. మృతుడు రౌడీషీటర్ అని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్య చేసుకున్నట్టు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం రాత్రి తెలిపారు. కొత్తవీరాపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం భార్య శశికళ(29) తరచూ కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు వివరించారు. ఆదివారం శశికళ కడుపు నొప్పి భరించలేక మనస్తాపంతో పురుగుల మందు తాగినట్లు చెప్పారు. భర్త గుర్తించి చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్టు సీఐ వివరించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

పరిహారం పంపిణీపైనా అక్కసే

- ఈయన పేరు శ్రీనివాసులు. కోటలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో కుటుంబంతో సహా ఉంటున్నాడు. తుపాను సమయంలో ఇంటిపైకి వరద నీరు వచ్చింది. అధికారులు గుర్తించి కాలనీలో ఉన్న 120 కుటుంబాల వారికి బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందించారు. కాలనీలో కొత్తగా చేరిన పది మందికి ఆధార్ కార్డులు లేక పోవడంతో నిత్యావసరాలు ఇవ్వలేకపోయారు.



- ఈమె పేరు చెంగమ్మ. చిట్టమూరు మండలం, రాగావారిపాళెంలో నివాసముంటున్నారు. తుపాను సమయంలో ఈమె ఇంటి చుట్టూ నీరు చేరింది. దీంతో అధిరులు సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి అక్కడే భోజనం ఏర్పాటు చేయడంతో పాటు వరదనీరు తగ్గిన తర్వాత ఇంటికి వెళ్లే సమయంలో రూ.2,500 అందించారు. దీంతో పాటుగా బియ్యం, కంది పప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేశారు.





పునరావాస కేంద్రంలో బాధితులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్‌రావు (ఫైల్)

- పక్కదారి పడుతోందంటూ పచ్చమీడియా పిచ్చిరాతలు

గూడూరు రూరల్: పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగా ఉంటుందన్నట్టు.. పచ్చమీడియాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏంచేసినా దానిపై విషం కక్కడం అలవాటుగా మారిపోయింది. తుపాను పరిహారం పంపిణీలోనే అదేరీతిలో స్పందిస్తోంది. బాధితులకు ఎక్కడా లోటులేకుండా నిత్యావసరాలతో పాటు నగదు అందించగా.. అందులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారంటూ గగ్గోలు పెడుతోంది. దీనిపై బాధితులు పెదవి విరుస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోని తలదాచుకున్న ప్రతి ఒక్కరికీ నగదు, నిత్యావసరాలు అందించారని, కానీ కొందరు కావాలనే పనిగట్టుకుని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడుతున్నారు. లబ్ధిపొందిన సరుకులు చూపిస్తూ ఎక్కడా లోటులేకుండా.. ఒక్కటీ తక్కువ లేకుండా అందించారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పొరపాట్లకు తావులేదు



తుపాను వరదల కారణంగా గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 27 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాలలో వరదల్లో చిక్కుకున్న 658 కుటుంబాలతో పాటుగా మరో 17 మంది ఒంటరిగా ఉన్న వారిని రక్షించాం. తుపాను నిలిచిపోయిన తరువాత ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.2,500 నగదు, ఒంటరిగా ఉన్న వారికి రూ.వెయ్యి చొప్పున అందించింది. అలాగే ప్రతిఒక్కరికీ 25 కేజీల బియ్యం, కేజీ కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంప, నూనె అందించింది. కోటలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో 130 కుటుంబాలు ఉండగా.. బయట నుంచి వచ్చిన 10 మందికి తప్పించి మిగిలిన 120 కుటుంబాల వారికి నిత్యావసరాలు, తుపాను పరిహారం పంపిణీ చేశాం. పరిహారం పంపిణీలో ఎక్కడా పొరపాటు జరగలేదు. అయితే కొంత మంది ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు. ఒక వేళ ఎవరైనా పునరావాస కేంద్రంలో తలదాచుకున్న బాధితులకు పరిహారం అందకపోతే నేరుగా నాకు ఫిర్యాదు చేయొచ్చు.

– కిరణ్‌కుమార్, ఆర్డీఓ, గూడూరు

- నా పేరు తిరుమలశెట్టి చెంచమ్మ. గూడూరు పట్టణంలోని నాల్గవ వార్డు(నరసయ్య గుంట) ప్రాంతంలో నివసిస్తున్నాను. గత వారం తుపాను కారణంగా వరదలొచ్చాయి. అధికారులు జిల్లా పరిషత్ పాఠశాలలో పునరావాసం కల్పించారు. రెండు రోజులు పాటు అక్కడే భోజనం పెట్టారు. వరద తగ్గిన తర్వాత ఇంటికి వచ్చే సమయంలో నా భర్తతో పాటు నాకు రూ.2 వేలు అందించడంతో పాటుగా 25 కేజీల బియ్యం, కందిపప్పు, నూనె, యర్రగడ్డలు, ఉల్లిపాయలు అందించారు. ఇవన్నీ సరిగానే ఉన్నాయి.



- నా పేరు పూరేటి పోలమ్మ. నరసయ్యగుంట ప్రాంతంలో నివాసముంటున్నాను. తుపాను కారణంగా వరద రావడంతో అధికారులు నాతోపాటు నా భర్త, పిల్లల్ని జెడ్పీ పాఠశాలకు తరలించారు. అక్కడ అందరికీ భోజనం, టిఫిన్లు పెట్టారు. ఇంటికి వచ్చే సమయంలో మాకు రూ.2,500 నగదుతోపాటు 25 కేజీల బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిగడ్డలు ఇచ్చారు. ఎమ్మెల్యే సారు వచ్చి అందరికీ దగ్గరుండి సరుకులు పంపిణీ చేశారు.



- నాపేరు ఎల్లమ్మ. నేను చిట్టమూరు మండలం, చింతలతోపులో నివాసముంటున్నాను. తుపాను సమయంలో సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో రెండు రోజులు పాటు తలదాచుకున్నాను. తుపాను తగ్గాక నేను ఒంటరి మహిళ కాబట్టి ప్రభుత్వం రూ.వెయ్యి నగదుతోపాటు ఇంటికి వెళ్లే సమయంలో 25 కేజీల బియ్యం, నూనె, కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందించింది. ఇక్కడ రెవెన్యూ అధికారులు దగ్గరుండి అందరికీ సరుకులు పంపిణీ చేశారు.



వైఎస్సార్‌సీపీలో చేరిక

చంద్రగిరి: తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు సోమవారం యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల పరిధిలోని పనపాకం పంచాయతీ, గడ్డంవారిపల్లికి చెందిన టీడీపీ నాయకులు దొమ్మలపాటి సుబ్బరామనాయుడు, నాగరాజనాయుడు, నాగేశ్వరరావునాయుడు, అంజనేయులునాయుడు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలకు మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, మట్టా మధు, చెంగల్రాయులు, మణియాదవ్, నాగభూషణం, నాగేశ్వరరావు, పసల నాగరాజు, గోపాల్, హరికృష్ణ, ఢిల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి